క్లుప్తంగా

5న ఈఎన్‌టీ వైద్యశిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏగూర్‌ప్రైమ్ ఆస్పత్రిలో ఈనెల 5న ఆదివారం ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో డాక్టర్ డిపిస్ కుమార్ చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన అన్ని రకాల సమస్యలకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల సమావేశం వాయిదా

నవాబుపేట: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సభ వాయిదా వేసినట్లు ఎంపీపీ అనంతయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం నిర్వహించే తేదీని త్వరలో అధికారులు ప్రకటిస్తారని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన ఎరుకలి శోభన్ బుధవారం కనిమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని గురువారం జెడ్పీటీసీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలను మృతుడి బంధువులకు అందజేశారు.

స్వయం పరిపాలన దినోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీ బ్రహ్మ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక విద్యార్థులు టీచర్లుగా మారి సందడి చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి జరీనాబేగం పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గన్నోజు చంద్రశేఖర్, అరుంధతి, సుజాత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

హన్వాడ: మండలంలోని వేపూర్ యూపీఎస్‌లో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎం దేవిజానాయక్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ ఆనంద్, వార్డుసభ్యులు బస్సన్న, విజయకుమార్ పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు



అడ్డాకుల: మండలంలోని కన్మనూర్‌కు చెందిన మీసాల మన్నెంకొండ కనిపించడం లేదని ఆయన భార్య ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మీసాల మన్నెకొండ, జ్యోతి దంపతులు. వ్యవసాయ పనులతో పాటు కూలీ పనులు చేసేవారు. గత నెల 28న మన్నెంకొండ తన భార్యతో గొడవపడి వెళ్లిపోయాడు. రెండు రోజుల పాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హోంగార్డ్ కుటుంబానికి చెక్కు అందజేత



మహబూబ్‌నగర్ క్రైం: విద్యుత్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాదర్‌అలీ గుండెపోటుతో మృతిచెందాడు. హోంగార్డ్స్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.15వేల చెక్కును గురువారం ఎస్పీ కార్యాలయంలో మృతుడి భార్య షహీన్‌బేగంకు ఎస్పీ కె.నరసింహ అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధరలను నిరసిస్తూ నేడు ధర్నా

దేవరకద్ర: వంటగ్యాస్ సిలిండర్ ధరలను పెంచినందుకు నిరసనగా శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం ఉదయం 10:30గంటలకు పాత బస్టాండ్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

- వందశాతం పన్ను వసూలు చేయాలి
- కలెక్టర్ రవినాయక్



బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రవినాయక్

బాలానగర్: ధరణి సమస్యలతో రైతులు ఇబ్బంది పడకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూముల క్రయ విక్రయాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 230 దరఖాస్తులను పూర్తి చేయాలని, పెండింగ్ వాటికి ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చి పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. మండలంలో హేమాజీపూర్, నేరళ్లపల్లి, మోతీఘణాపూర్ తదితర గ్రామాల్లో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని కలెక్టర్‌కు తెలుపగా రికార్డులను అనుసరించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ధరణిలోని తీవ్రమైన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించి గ్రామ పంచాయతీలకు అందుతున్న పెండింగ్ బిల్లులపై ఆరా తీశారు. రెండు నెలలుగా బిల్లులు ఆలస్యం అయ్యిందని, త్వరలోనే సమస్య తీరుతుందని తెలిపారు. పన్ను వసూలు వందశాతం పూర్తి చేయాలని ఎంపీఓ నజీర్‌అహ్మద్‌ను ఆదేశించారు. ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీఓ రాజశేఖర్‌రెడ్డికి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కోపరేటీవ్ చైర్మన్ వాల్యానాయక్, ఎంపీపీ కమల తదతరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి..

రాజాపూర్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని కలెక్టర్ రవినాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ రాంబాయికి సూచించారు. ధరణిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, స్లాట్‌బుకింగ్‌లో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీదేవి, డీటీ భరత్, ఎంపీఓ వెంకట్రాములు, ఆర్‌ఐ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మాణం చేపట్టవద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పాతబజార్ ఎస్సీ కాలనీలో రూ.కోటితో నిర్మాణం తలపెట్టిన మాడ్రన్ శ్మశానఘాట్ నిర్మాణం చేపట్టరాదని గురువారం తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్‌లకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఏడాది కిందట కలెక్టర్‌కు తమ సమస్యను విన్నవించగా, నిర్మాణం నిలిపివేశారని, మళ్లీ అక్కడే నిర్మాణం చేపడతామని చెప్పడం సరికాదన్నారు. తమ ఆచారాలకు విరుద్ధంగా ఉందని వారి దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే వెనుకబడిన కులాలుగా మగ్గుతున్న తమ ఇళ్ల మధ్య ఇలా శ్మశానవాటికల పేరుతో మరింత దయనీయంగా మార్చొద్దని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో పురుషోత్తం, వంశీ, బాల్‌రాజ్, రవికిశోర్, మల్లేష్, బుచ్చిలింగం, శివకుమార్ ఉన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదవాలి



రుద్రారంలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈఓ యాదయ్య

నవాబుపేట: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని డీఈఓ యాదయ్య అన్నారు. గురువారం ఆయన మండలంలోని కూచూర్, రుద్రారం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో పాటు భోజనం చేశారు. విద్యార్థులను వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సందేహాలకు సమాధానాలు చెప్పారు. కూచూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ జనార్దన్, హెచ్‌ఎంలు శాంత, ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎంఐఎం నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం బర్హానే బాద్‌షా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల హక్కులను కాపాడుతూనే ఇతర వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పార్టీ బలోపేతమవుతున్నదని, అన్ని వర్గాల ప్రజలతో కలిసి పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, యువత విభాగం జిల్లా అధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్, పట్టణ అధ్యక్షుడు సాధతుల్లా హుస్సేని, కౌన్సిలర్లు ముస్తాక్ రషీద్, నాయకులు జహంగీర్, మహెబూబ్, వహీద్ సనా, ఇక్రముల్లా షరీఫ్, ఆరిఫ్ ఫారూఖీ పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ రామయ్య

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్‌లో గురువారం కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బొర్ర రామయ్య పరిశీలించారు. గ్రామంలోని రైతువేదికలో శుక్రవారం కంటి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. గత 10రోజులుగా మండలంలోని మద్దిగట్ల, లంబడికుంట తండాల్లో 1,706 మందికి కంటి పరీక్షలు చేయగా, 268 మందికి కంటి అద్దాలు పంపిణీ, 413 మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాధిక, హిమబిందు, సర్పంచ్‌లు కమలమ్మ, ప్రియాంక, కార్యదర్శులు గోపి, సింధు, అప్తాలమెట్రిక్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

241 మందికి పరీక్షలు..

మహమ్మదాబాద్: మండలంలో గురువారం 241 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మండలంలోని షేక్‌పల్లిలో 117 మందికి పరీక్షలు చేయగా, మొకర్లాబాద్‌లో 124 మందికి పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి మహమ్మద్ తెలిపారు. శుక్రవారం నుంచి ముందలితండా, వెంకట్‌రెడ్డిపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం జెడ్పీ హైస్కూల్‌ను గురువారం వెరిఫికేషన్ టీం సందర్శించింది. వివేకానంద నాయకత్వంలోని ఉపాధ్యాయ బృందం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతిక జీవశాస్త్రము, కో కరికులర్ విషయాలపై విద్యార్థుల మార్కులు పరిశీలించారు. వెరిఫికేషన్ టీం సందర్శన సమయంలో ఎంఈఓ మంజులాదేవి, ఉపాధ్యాయులు అబ్దుల్ అలీం, జ్యోతి, గంగాపురం హెచ్‌ఎం సురేష్ ఉన్నారు.

పెద్దచెరువును అభివృద్ధి చేస్తాం



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ పెద్దచెరువును ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. ఐసీఐసీ ఫౌండేషన్ వారు కార్పొరేటీవ్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద పెద్దచెరువు అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు. ఇందులో భాగంగా చెరువుకట్ట వెడల్పు, తూముల మరమ్మతు, చెరువు పూడికతీత వంటి పనులు చేపట్టనున్నారు. చేవెళ్ల డివిజన్ ఇరిగేషన్ ఈఈ రేణుకాదేవి, డీఈ వెంకట్‌రమణ, ఐసీఐసీ ఫౌండేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ విశాల వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ పుల్లారెడ్డితో అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మయ్య, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కురిహినిశెట్టి కాలనీలో గల అక్షర హైస్కూల్‌లో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు రామలింగం, కౌన్సిలర్లు అంజయ్య, చెన్న వీరయ్య, శాంతయ్య తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నర్సింహరాజు, ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తాం



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్

కోయిల్‌కొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్ తెలిపారు. గురువారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించి, బ్యాంకు అకౌంట్లు తెరిపించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో గ్రామాల్లో జరుగుతున్న నర్సరీల పనులు, క్రీడాప్రాంగణాలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



మిడ్జిల్‌లో హర్షం తెలుపుతున్న నాయకులు

మిడ్జిల్: త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ గెలుపొందడంపై గురువారం రాత్రి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, అంజి, శివ, పర్వతాలు, అరవింద్, మన్యం, సంతోష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుపై హర్షం

హన్వాడ: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ విజయం సాధించి ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా సమాధానం ఇచ్చినట్లయ్యిందని, త్వరలో తెలంగాణలో జరిగే ఎన్నికల్లోనూ బీజేపీ కాషాయ జెండా ఎగరడం ఖాయమని పార్టీ జిల్లా కార్యదర్శి కొండా బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవికుమార్, శివలింగం తదితరులు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయ దుందుబీ మోగించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు బీజేపీ ఆదరించి మరోసారి విజయాన్ని కట్టబెట్టినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోనూ బీజేపీ అధికారాన్ని చేపట్టనుందని, డబుల్ ఇంజన్ సర్కారు రాబోతున్నట్లు ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ముందుకు వచ్చింది. ఈ మేరకు గురువారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ ఏర్పాటు చేసిన సమావేశానికి బ్యాంకు అధికారులు హాజరయ్యారు. ప్లాస్టిక్ వాడకంతో ఏర్పడే ఇబ్బందులను, అనర్థాలను ప్రజలకు తెలియజేసి చైతన్యవంతులుగా మార్చనున్నారు. సామాజిక సేవలో భాగంగా తాము చేపట్టబోయే కార్యాచరణను కమిషనర్ ముందుంచారు.

సీసీ కెమెరాలు ఎంతో అవసరం



ఎర్రగుట్టలో అవగాహన కల్పిస్తున్న సీఐ రమేశ్‌బాబు

జడ్చర్ల: స్థానిక ఎర్రగుట్ట ప్రాంతంలో గురువారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో నివాసం ఉంటున్న వారిని విచారించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బైక్‌లు తదితర వాహనాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 45 మోటర్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, రెండు ఆటోలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ రమేశ్ బాబు మాట్లాడుతూ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి వ్యవహరించాలని, రోడ్డు ప్రమాదాలు, మూఢ నమ్మకాలు తదితర అంశాలను గురించి వివరించారు. డయల్ 100, సైబర్ పోర్టల్ నంబర్ 1930, మహిళల భద్రతకు సంబంధించి షీటీంలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, లెనిన్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధరలను తగ్గించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి

కోయిల్‌కొండ: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలను పెంచి సామాన్యుల నడ్డివిరుస్తోందని, మళ్లీ కట్టెపొయ్యి దిక్కయ్యే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మండలంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భీంరెడ్డి, రాజ్‌కుమార్, మొగులయ్య, గోపాల్, నాగిరెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆరోగ్యానికి పౌష్టికాహారం, నీరు ఎంతో అవసరమని డాక్టర్ టి.చేతన రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఇంధనం లేకపోతే యంత్రం ఎలా పనిచేయలేదో అలా మన శరీరం సైతం ఆహారం లేకపోతే సరిగా పనిచేయదన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, కూరగాయలు ఎక్కువగా, అన్నం తక్కువగా తీసుకోవాలన్నారు. శరీరతత్వం, రసాయన క్రియలు, ఆహార ప్రభావం మానవులపై ఎలా ఉంటుందో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్, అధ్యాపకులు (జంతుశాస్త్ర విభాగం ఇన్‌చార్జ్) నసీం బాబు, శ్రీలత, శ్రావణి, వరుదిసీప్రియ, శివప్రసాద్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. తర్నికల్‌కు చెందిన మమతకు రూ.14వేలు, మల్లేశ్‌కు రూ.40వేలు, భాస్కర్‌కు రూ.52వేలు, మెలిక రాజుకు రూ.60వేలు, సీతకు రూ.60వేలు, జహంగీర్‌కు రూ.50వేల చెక్కులను అందజేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టలేం

- ట్రాక్టర్లు తిరిగి అప్పగిస్తాం
- అధికారులకు తేల్చిచెప్పిన సర్పంచ్‌లు



ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

గండేడ్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టలేమని.. మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వలేక.. ట్రాక్టర్లకు డీజిల్ పోయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని సర్పంచ్‌లు అంతా ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డికి తమ సమస్యలు తెలిపారు. ఉమ్మడి మండలాల పరిధిలో 49 గ్రామపంచాయతీలు ఉన్నాయని, అభివృద్ధి పనులకు నిధులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, వివిధ పనులకు గాను ట్రాక్టర్లకు డీజిల్ పోసేందుకు కూడా నిధులు లేక సతమతమవుతున్నట్లు తెలిపారు. 15ఫైనాన్స్‌లో రెగ్యులర్‌గా వచ్చే డబ్బులు కాకుండా కొంత మేర అకౌంట్లలో పడినా అవి కూడా ఫ్రీజింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఐదు నెలలుగా అనేక ఇబ్బందులు పడుతున్నామని, నిధులు లేకపోతే అభివృద్ధి పనులు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. ఇకపై పారిశుద్ధ్య పనులు చేపట్టలేమని, ట్రాక్టర్లు సైతం మీరే తీసుకోవాలని అధికారులకు తేల్చిచెప్పారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే సోమవారం ట్రాక్టర్లను, మల్టీపర్పస్ వర్కర్లను ఎంపీడీఓ కార్యాలయానికి అప్పగిస్తామని వెల్లడించారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జితేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, వెంకటయ్య, కిరణ్, హన్మంతు, రవీందర్‌రెడ్డి, రాజునాయక్, నీలేష్, బాలాజీ, రఘుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు తెలిపాం..

ఈ విషయమై ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి డీపీఓ వెంకటేశ్వర్లుతో మాట్లాడి సమస్యలు వివరించారు. ఇందుకు డీపీఓ స్పందించి మాట్లాడారు. కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులతో ఈ విషయమై ఇప్పటికే తెలిపామని అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కల్వకుర్తిరూరల్: ప్రతి కూలీకి ఉపాధి హామీ పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. గురువారం మండలంలోని జీడిపల్లి, కురుమిద్దె గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికను పరిశీలించారు.